ప్రజా

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 201 పేజీలు : 04 వెల రూ. 2 బుధవారం 28 - 01 - 2026




ఎన్నికల వేళ భారత్‌పై పాక్ కరెన్సీ దాడి
దేశంలోకి కోట్ల నకిలీ నోట్లను పంపేందుకు డీ-కంపెనీ కుట్ర

# తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

- ఫిబ్రవరి 11న పోలింగ్, 13న కౌంటింగ్
- 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల
- తక్షణమే రాష్ట్రంలో అమల్లోకి ఎన్నికల కోడ్
- నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ
- ఫిబ్రవరి 16న మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక
- రాష్ట్రంలో రసవత్తరంగా జరగనున్న మున్సిపల్ ఎన్నికల పోరు
- మున్సిపల్ ఎన్నికల్లో 52 లక్షల 43 వేల మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు
- రాష్ట్రంలో 130 మున్సిపాలిటీలు ఉంటే వివిధ కారణాలతో 116 మున్సిపాలిటీలలో మాత్రమే ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు



హైదరాబాద్ : మున్సిపల్ ఎన్నికల్లో 52 లక్షల 43 వేల మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 130 మున్సిపాలిటీలు ఉంటే వివిధ కారణాలతో 116 మున్సిపాలిటీలలో మాత్రమే ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. కంట్రోల్ రూం నుంచి ఓటింగ్ ప్రక్రియను మానిటరింగ్ చేయనున్నట్లు తెలిపారు. రూ.50 వేలకు మించి నగదుకు లెక్క చూపవలసి ఉంటుందని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరుగుతాయని తెలిపారు.తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగుతుందని ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ప్రకటించారు. - మిగతా 2 లో

వాటిని పట్టించుకోవాల్సిన

# అవసరం లేదు



- ముఖ్యమంత్రి విదేశాల్లో ఉన్న సమయంలో కీలక భేటీ
- స్పందించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క
- విదేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- భట్టివిక్రమార్కతో మంత్రులు సమావేశం
- ఉప ముఖ్యమంత్రితో మంత్రులు సమావేశం కాకూడదా అని భట్టివిక్రమార్క ప్రశ్న
- సీఎం అందుబాటులో లేనందున తనతో చర్చించేందుకు వచ్చారని స్పష్టీకరణ
- పిచ్చివాళ్లు ఏవేవో మాట్లాడుతుంటారని,వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు

హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో ఉండగా, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ సమావేశం కావడం తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ భేటీపై మల్లు భట్టి విక్రమార్క స్పందించారు. - మిగతా 2 లో




## మేడారం జాతరకు సర్వం సిద్ధం

నాలుగు రోజుల పాటు జరగనున్న మేడారం సమ్మక్క-సారక్క మహాజాతర ప్రారంభం

ఈ వేడుకకు రెండు కోట్ల మందికి పైగా భక్తులు హాజరవుతారని అంచనా

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ. 251 కోట్లతో భారీ ఏర్పాట్లు

భక్తుల కోసం ప్రత్యేక బస్సులు, రైళ్లు... అందుబాటులో హెలికాప్టర్ సేవలు!

భద్రత కోసం 13,000 మంది పోలీసుల మోహరింపు, డ్రోన్లతో నిఘా

# వరుసగా 9వసారి బడ్జెట్ చరిత్ర సృష్టించనున్న నిర్మలమ్మ

- ముగిసిన హల్వా వేడుక.. హల్వా వేడుకతో లాక్ ఇన్!
- బడ్జెట్ ప్రవేశపెట్టేవరకు వాళ్లు బయటికి రారు!
- ఫిబ్రవరి 1న వరుసగా పార్లమెంటులో తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి
- మోదీ ప్రభుత్వంలోనే అత్యధికంగా బడ్జెట్‌లు ప్రవేశపెట్టిన రికార్డు
- బడ్జెట్ చరిత్రలో ఆసక్తికరమైన విశేషాలు ఇవే!
- కేంద్ర బడ్జెట్ 2026-27 తయారీలో ముగిసిన హల్వా వేడుక
- ఈ వేడుకతో ప్రారంభమైన బడ్జెట్ అధికారుల 'లాక్-ఇన్' పీరియడ్
- మొబైల్ యాప్‌లోనూ అందుబాటులో ఉండనున్న బడ్జెట్ పత్రాలు



ఢిల్లీ : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మరోసారి చరిత్ర సృష్టించబోతున్నారు. ఫిబ్రవరి 1వ తేదీన ఆమె వరుసగా తొమ్మిదోసారి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. స్వాతంత్ర్య భారతదేశ చరిత్రలో ఒకే ప్రధానమంత్రి హయాంలో వరుసగా తొమ్మిది బడ్జెట్‌లు ప్రవేశపెట్టిన తొలి ఆర్థిక మంత్రిగా ఆమె రికార్డు సొంతం చేసుకోనున్నారు. దేశ ఆర్థిక పరిస్థితులు, అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ అనిశ్చితుల మధ్య ఈసాలరి బడ్జెట్‌లో కీలక సంస్కరణలు ఉండనున్నాయని అంచనాలు ఉన్నాయి.2019లో ప్రధాని నరేంద్ర మోదీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మలా సీతారామన్‌ను మహిళా ఆర్థిక మంత్రిగా నియమించారు. అప్పటి నుంచి వరుసగా బడ్జెట్‌లు ప్రవేశపెడుతూ వస్తున్నారు. 2024లో మోదీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా ఆర్థిక శాఖ బాధ్యతలు ఆమెకే కొనసాగాయి. ఇప్పటివరకు ఆమె ఎనిమిది బడ్జెట్‌లు ప్రవేశపెట్టగా, 2024 ఫిబ్రవరిలో మధ్యంతర బడ్జెట్ కూడా ఇందులో భాగమే.అయితే ఈసారి ప్రవేశపెట్టనున్న తొమ్మిదో బడ్జెట్‌తో ఆమె మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ రికార్డుకు - మిగతా 2 లో




## ఆధార్, మొబైల్ లింక్ పై కీలక అప్ డేట్

ఇకపై ఎక్కడి నుంచైనా మొబైల్ నంబర్ అప్ డేట్ చేసుకునే వీలు

నేటి నుంచి అమలు రానున్న సదుపాయం!

యూఐడీఏఐ కీలక ప్రకటన

ధార్ సేవలను మరింత సౌకర్యవంతంగా వినియోగించుకునేలా చేయడమే దీని ఉద్దేశం

## ఫ్రాన్స్‌లో తొలి హిందూ దేవాలయానికి శంకుస్థాపన




- పారిస్ సమీపంలో హిందూ దేవాలయం నిర్మాణం
- ఇండియా నుంచి వచ్చిన తొలి రాళ్లకు ఘన స్వాగతం
- మన భారతీయ వాస్తుశిల్ప సంప్రదాయాలు, ఫ్రెంచ్ ఇంజినీరింగ్ నైపుణ్యంతో ఆలయ నిర్మాణం

ఢిల్లీ : భారత్ ఫ్రాన్స్ మధ్య సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంబంధాలు మరింత బలోపేతమయ్యేలా మరో అడుగు పడింది. పారిస్ సమీపంలోని బుస్సీ-సెయింట్-జార్జెస్‌లో నిర్మాణమవుతున్న మొదటి హిందూ దేవాలయానికి శంకుస్థాపన చేశారు. ఆలయ నిర్మాణానికి సంబంధించిన తొలి రాళ్లు వచ్చాయి. ఈ రాళ్లకు అక్కడున్న ఇండియన్ కమ్యూనిటీ ఘన స్వాగతం పలికింది.శతాబ్దాల నాటి హస్తకళా వారసత్వాన్ని, నైపుణ్యాన్ని ఉపయోగించి ఆలయాన్ని నిర్మించనున్నారు. ఆలయ నిర్మాణం కోసం భారతీయ కళాకారులు - మిగతా 2 లో




# పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు



- టీడీపీ శ్రేణులకు రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్
- రాష్ట్ర అభివృద్ధికి కనీసం 15 ఏళ్లు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండాలని సూచన
- పార్టీ నేతలు అలక వీడి, ఐక్యంగా పనిచేయాలని పిలుపు
- శిక్షణ తరగతుల్లో నిత్య విద్యార్థిలా వెనుక కూర్చుని పాఠాలు విన్న లోకేశ్
- యువగళం పాదయాత్ర మూడేళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో వేడుకలు

అమరావతి : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం చేశారు. పార్టీ అనేది సొంతిల్లు వంటిదని, ప్రభుత్వం కిరాయి ఇల్లు లాంటిదని - మిగతా 2 లో

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేద్దాం...

# పడగొట్టినవి నిలబెడదాం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- రాయలసీమ, ప్రకాశం జిల్లాల సమగ్రాభివృద్ధిపై ప్రధానంగా దృష్టి
- 500 లక్షల మెట్రిక్ టన్నుల ఉద్యాన ఉత్పత్తులే లక్ష్యంగా కార్యాచరణ
- ప్రాధాన్యత క్రమంలో 20కి పైగా ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఆదేశం
- గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణకు ప్రణాళికలు



అమరావతి : రాష్ట్రంలో పెండింగులో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి, గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన నిర్మాణాలను పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం ప్రాంతాలను ప్రపంచంలోనే అతిపెద్ద ఉద్యాన క్లస్టర్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో 10 జిల్లాలను ఉద్యాన కేంద్రాలుగా మార్చే సమీకృత అభివృద్ధి ప్రణాళికలపై మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, అనేక - మిగతా 2 లో

# సంపాదకీయం

## సహనమే శరణ్యం

సహనం, ఓరిమి, క్షమ ఉత్తములైన మనుషుల సహజ లక్షణాలని వేద పురాణేతి హాసాలు, వివిధ మత గ్రంథాలు, నీతిశాస్త్రాలు చెబుతున్నాయి. 'క్షమా భూమిః క్షమా సర్వం/ క్షమయా ధార్యతే జగత్' అని అధర్వణ వేదం చెబుతోంది. 'క్షమా దానం క్షమా సత్యం క్షమా యజ్ఞః చ పుత్రికాః/ క్షమా యశః క్షమా ధర్మః క్షమాయాం విష్ఠితం జగత్' అని వాల్మీకి రామాయణం చెబుతోంది. 'క్షమా ధర్మః క్షమా యజ్ఞః/ క్షమా వేదః క్షమా శ్రుతిః/ క్షమయా ధార్యతే లోకః క్షమయా కిం న సాధ్యతే' అని వ్యాస మహాభారతం చెబుతోంది. క్షమను మించిన సుగుణం లేదు, క్షమతో సాధ్యం కానిది లేదు అని ఈ శ్లోకాల సారాంశం.'ఖంతీ పరమం తపో తితిక్ఖా' అని బుద్ధుని ధమ్మపదం చెబుతోంది. అంటే, సహనమే అత్యున్నత తపస్సు అని అర్థం. 'సహన శీలః సజ్జనః/ కోపహీన సదా భవేత్/ కోపోహి శత్రురత్యంతం/ తస్మాత్ క్షమైవ శ్రేయసీ' అని భర్తృహరి నీతి శతకం చెబుతోంది. ఇదే నీతిని 'తన కోపమె తన శత్రువు/ తన శాంతమె తనకు రక్ష దయ చుట్టంబౌ/ తన సంతోషమె స్వర్గము/ తన దుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ' అని సుమతీ శతకం చెబుతోంది.'గర్విష్ఠుల కంటే సహనము గలవాడు మేలు' అని బైబిల్ చెబుతోంది. 'నిశ్చయంగా అల్లాహ్ సహనశీలురతో ఉంటాడు' అని ఖురాన్ చెబుతోంది.పురాణేతిహాసాలు, వివిధ మతాల పవిత్ర గ్రంథాలు, నీతిశాస్త్రాలు చెప్పిన ఈ మాటలను ప్రవచనాల్లోను, ఉపన్యాసాల్లోను తరచు ఉట్టంకిస్తుంటారు. అయితే, వీటిని ఆచరించడాన్నే మనుషులు మరచిపోతుంటారు. ఎదుటి మనిషి తమకు నచ్చని అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తే చాలు, ఒక్కసారిగా సహనం నశించి, కోపం కట్టలు తెంచుకుంటుంది. అప్పటి వరకు వల్లించిన నీతులన్నీ ఒక్కసారిగా మరపు మరుగున పడిపోయి, బూతుల ప్రవాహం వరదలా పోటెత్తుతుంది. తగవు మొదలై బాహాబాహీ సిగపట్ల వరకు వ్యవహారం ముదురుతుంది. మనుషుల్లో సహనం నశించినప్పుడే సమాజంలో నేరాలు, ఘోరాలు జరుగుతుంటాయి. పౌరుల్లో సహనం నశించి, తప్పటడుగులు వేస్తే, చక్కదిద్దే పనిని పాలనా వ్యవస్థలు చేపడతాయి.దురదృష్టవశాత్తూ పాలనా వ్యవస్థలు కూడా సహనం కోల్పోయి, కక్ష సాధింపులకు తెగబడుతున్న రోజులు దాపురించాయి. సత్యం పట్ల అసహనం, ప్రశ్న పట్ల అసహనం, ధిక్కారం పట్ల అసహనం, భిన్నాభిప్రాయం పట్ల అసహనం పెచ్చుమీరిన పాలకులు సత్యాన్ని ప్రకటించే పాత్రికేయుల పట్ల, ప్రశ్నించే పౌరుల పట్ల, భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసే విపక్ష నేతల పట్ల కక్ష సాధింపు చర్యలకు తెగబడే ధోరణి పెరుగుతోంది. ధిక్కార స్వరాలను వినిపించే వారిని కటకటాల్లోకి నెట్టే వైఖరి ప్రబలుతోంది. పట్టించుకోవలసిన అనేక సమస్యలను పట్టించుకోకుండా, భిన్నస్వరాలపై కక్ష సాధింపు చర్యలకే ప్రాధాన్య మిస్తున్న ప్రభుత్వాలు ప్రజాస్వామ్యం మనుగడకే ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. ఇవన్నీ ఇటీవలి కాలంలో మన దేశంలో కనిపిస్తున్న పరిస్థితులు.ప్రపంచ పరిస్థితులు కూడా ఏమంత భిన్నంగా లేవు. ఆర్థికబలం, ఆయుధ బలగం దండిగా కలిగిన అగ్రరాజ్యాలు బలహీన దేశాలపై అసహనంతో యుద్ధాలకు తెగబడు తున్నాయి. బలహీన దేశాల అధినేతలను చెరబడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం దాదాపు దేశాలు ప్రత్యక్షంగా యుద్ధాలను ఎదుర్కొంటున్నాయి. సుమారు మరో ఇరవై దేశాలు అంతర్యుద్ధాలతో అట్టుడుకుతున్నాయి. ఇంకో పదిహేను దేశాలు ప్రచ్ఛన్న యుద్ధాలతోను, చొరబాట్లు, సైనిక హింస తదితర సమస్యలతో సతమతం అవుతున్నాయి. ఈ దారుణ దుర్భర పరిస్థితులకు మూలకారణం అసహనం.ప్రపంచంలో యుద్ధాలు సద్దుమణగాలన్నా; దేశాల్లో పౌరుల స్వేచ్ఛకు భద్రత దొరకాలన్నా; విభిన్న మతాలు, జాతుల మధ్య సామరస్యం పెరగాలన్నా సహనమే కీలకం. 'క్షమా బలమశక్తానాం/ శక్తానాం భూషణం క్షమా' అని మహాభారతం చెబుతోంది. బలహీనులకు క్షమే బలం; బలవంతులకు అది అలంకారం. మనుషుల్లో క్షమ, ఓరిమి, సహనం వంటి సహజ సుగుణాలు పెరిగినప్పుడే ప్రపంచంలో శాంతి పరిఢవిల్లుతుంది. మన గణతంత్రం 'ఘన'తంత్రమవుతుంది.

## ఆధార్, మొబైల్ లింక్ పై కీలక అప్ డేట్

**మొదటిపేజీ తరువాయి** – ఆధార్ కార్డు సేవలను మరింత సరళతరం చేయడానికి భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) కీలక నిర్ణయం తీసుకుంది. ఆధార్ తో అనుసంధానమైన మొబైల్ నంబర్ ను అప్ డేట్ చేసుకునే విషయంపై కీలక ప్రకటన చేసింది. ఇకపై ఎక్కడి నుంచైనా మొబైల్ నెంబర్ ను అప్ డేట్ చేసుకునే సదుపాయం కల్పించనుంది.దీని కోసం త్వరలో కొత్త వ్యవస్థను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపింది. ఆధార్ సేవలను మరింత సౌకర్యవంతంగా వినియోగించుకునేలా చేయడమే దీని ఉద్దేశమని తెలిపింది. నేటి తర్వాత ఈ సౌకర్యం అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలుస్తోంది.

## ఫ్రాన్స్ లో తొలి హిందూ దేవాలయానికి శంకుస్థాపన

**మొదటిపేజీ తరువాయి** – స్థానిక ఫ్రెంచ్ రాతి పనివారితో కలిసి పనిచేస్తారు. వీరిలో నోట్రే-డామ్ కేథడ్రల్ పునరుద్ధరణలో పాల్గొన్న నిపుణుల బృందం కూడా ఉంది. భారతీయ వాస్తుశిల్ప సంప్రదాయాలను ఫ్రెంచ్ ఇంజినీరింగ్ నైపుణ్యంతో ఏకం చేసి ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ, "భారతదేశం నుంచి మొదటి రాళ్ల రాక ఒక చారిత్రాత్మక మైలురాయి. ప్రతి రాయి వారసత్వం, శ్రద్ధ, ఉద్దేశాన్ని కలిగి ఉంటుంది. ఇది భాగస్వామ్య గౌరవం, సహకారం ద్వారా భారతీయ సంప్రదాయం, ఫ్రెంచ్ ఇంజినీరింగ్ యొక్క ఐక్యతను సూచిస్తుంది" అని తెలిపారు.

## వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదు

**మొదటిపేజీ తరువాయి** – ఉప ముఖ్యమంత్రితో మంత్రులు సమావేశం కాకూడదా అని ఆయన ప్రశ్నించారు.మంత్రులు తనతో భేటీ కావడం సాధారణ విషయమేనని ఆయన స్పష్టం చేశారు. ఇది పాలనాపరమైన అంశాలపై జరిగిన సమావేశమని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి అందుబాటులో లేనందున మంత్రులు ఉప ముఖ్యమంత్రిగా తనతో చర్చించేందుకు వచ్చారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు అందరూ కలిసి ఒక ఉమ్మడి కుటుంబంలా పనిచేస్తున్నామని ఆయన అన్నారు.ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలో ఉన్న సమయంలో ఈ భేటీ జరగడం చర్చకు దారి తీసిందని మీడియా ప్రతినిధి ప్రశ్నించగా, మల్లు భట్టి విక్రమార్క స్పందిస్తూ, కొందరు పిచ్చివాళ్లు ఏవేవో మాట్లాడుతుంటారని, వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు.

## మేడారం జాతరకు సర్వం సిద్ధం



**మొదటిపేజీ తరువాయి** – తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర, మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర రేపు (జనవరి 28) ప్రారంభం కానుంది. ములుగు జిల్లాలోని మేడారం గ్రామంలో జరిగే ఈ నాలుగు రోజుల వేడుకకు దేశం నలుమూలల నుంచి సుమారు రెండు కోట్లకు పైగా భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్‌కు దాదాపు 240 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గిరిజన పుణ్యక్షేత్రం ఇప్పటికే జనసంద్రంగా మారింది.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా సహా పలు రాష్ట్రాల నుంచి గిరిజనులు, గిరిజనేతరులు ఈ జాతరకు పోటెత్తుతున్నారు. ఇప్పటికే గత కొద్ది రోజులుగా దాదాపు 10 లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. వనదేవతలైన సమ్మక్క, సారలమ్మల వీరత్వాన్ని, త్యాగాన్ని స్మరించుకుంటూ రెండేళ్లకోసారి ఈ జాతరను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు.ఈ ఏడాది జాతర కోసం రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 251 కోట్లు ఖర్చు చేసింది. 21 శాఖలకు చెందిన 42,000 మందికి పైగా అధికారులు, సిబ్బందిని, 2000 మంది ఆదివాసీ వాలంటీర్లను భక్తుల సేవ కోసం నియమించారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా 13,000 మంది పోలీసులను మోహరించారు. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత డ్రోన్లతో జాతరను పర్యవేక్షిస్తున్నారు. 1,418 ఎకరాల్లో 42 పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. జంపన్న వాగు వద్ద 200 మంది గజ ఈతగాళ్లను, 30 వైద్య శిబిరాల్లో 5,192 మంది వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. పారిశుధ్యం కోసం 5,000 మంది కార్మికులు, 5,700 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు.భక్తుల రవాణా కోసం టీజీఎస్‌ఆర్టీసీ 4,000 ప్రత్యేక బస్సులను, దక్షిణ మధ్య రైల్వే 28 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. పర్యాటక శాఖ హనుమకొండ నుంచి మేడారానికి హెలికాప్టర్ సేవలను కూడా అందిస్తోంది. రౌండ్ ట్రిప్‌తో కూడిన వీఐపీ దర్శనానికి రూ. 35,999, జాతర ఏరియల్ వ్యూ కోసం ఒక్కొక్కరికి రూ. 4,800 చొప్పున ఛార్జీలను నిర్ణయించారు.కాకతీయ పాలకుల పన్నుల విధానాన్ని ఎదిరించి పోరాడిన గిరిజన వీరవనితలు సమ్మక్క, ఆమె కుమార్తె సారక్క (సారలమ్మ)ల శౌర్యాన్ని స్మరించుకుంటూ ఈ జాతరను నిర్వహిస్తారు. కోయ తెగకు చెందిన ఈ తల్లీకూతుళ్లను గిరిజనులు దేవతలుగా కొలుస్తారు. పోరాటంలో అలసిపోయిన సమ్మక్క చిలుకలగుట్ట వైపు వెళ్లి అదృశ్యమయ్యిందని, ఆమె కోసం వెతికిన గిరిజనులకు ఓ వెదురు చెట్టు కింద కుంకుమ భరిణె మాత్రమే లభించిందని స్థానిక కథనం. అప్పటి నుంచి రెండేళ్లకోసారి గిరిజన పూజారులు వెదురు వనంలో ప్రత్యేక పూజలు చేసి, కుంకుమ భరిణె, ఎర్రటి వస్త్రం చుట్టిన వెదురు కర్రను సమ్మక్క ప్రతిరూపంగా భావించి గద్దెల వద్దకు తీసుకువస్తారు.అంతకుముందు రోజు కన్నేపల్లి నుంచి సారలమ్మను తీసుకువచ్చి గద్దెలపై ప్రతిష్ఠించడంతో జాతర అధికారికంగా మొదలవుతుంది. భక్తులు తమ బరువుకు సమానమైన బెల్లాన్ని (బంగారం) అమ్మవార్లకు సమర్పిస్తారు. జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించడం ఇక్కడి ముఖ్యమైన సంప్రదాయం.

## పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేద్దాం... పడగొట్టినవి నిలబెడదాం



**మొదటిపేజీ తరువాయి** – ప్రాజెక్టులను పెండింగ్‌లో పెట్టిందని ఈ సమావేశంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్ ప్రస్తావించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, 10 జిల్లాల పరిధిలో ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. తక్కువ నిధులతో త్వరగా పూర్తయ్యే వాటికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ ఏడాదిలోనే వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలని, గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణకు వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. గాలేరు-నగరి ద్వారా కృష్ణా జలాలను కడప వరకు తీసుకెళ్లే అంశంపై దృష్టి సారించాలన్నారు. మొత్తంగా 20కి పైగా ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా కొత్తగా 8.87 లక్షల ఎకరాల ఆయకట్టుకు, మరో 4.30 లక్షల ఎకరాల స్థిరీకరణకు నీరందించవచ్చని అధికారులు సీఎంకు వివరించారు. ఇదే సమయంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లోనూ ప్రాజెక్టులు చేపట్టాలని, పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తయితే గోదావరి జలాలను ఉత్తరాంధ్ర వరకు తీసుకెళ్లి, పోలవరం-వంశధార నదుల అనుసంధానం చేపట్టవచ్చని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

**ప్రపంచస్థాయి ఉద్యాన హబ్‌గా రాయలసీమ**

ఈ ప్రాజెక్టులు పూర్తయితే రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో ఉద్యాన పంటల సాగు గణనీయంగా పెరుగుతుందని మంత్రి అచ్చెన్నాయుడు అభిప్రాయపడ్డారు. గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా 500 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తులను పండించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని సీఎం సూచించారు.రాష్ట్రంలోని 10 జిల్లాల్లో 201 క్లస్టర్లు, 303 మండలాల్లో ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. మూడేళ్లలో ఉద్యాన సాగు విస్తీర్ణాన్ని 8.41 లక్షల హెక్టార్ల నుంచి 14.41 లక్షల హెక్టార్లకు పెంచేలా ప్రణాళికలు రూపొందించారు. దుబాయ్‌కి చెందిన డీపీ వరల్డ్ సంస్థ ఏపీలో ఉద్యాన క్లస్టర్ ఏర్పాటుకు ముందుకొచ్చిందని సీఎం వెల్లడించారు.అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఎకోసిస్టమ్ అభివృద్ధి చేయాలని, ఇందుకు అవసరమైన గ్రామీణ రహదారుల నెట్‌వర్క్, లాజిస్టిక్స్, మార్కెట్, గ్లోబల్ కనెక్టివిటీపై దృష్టి పెట్టాలని ఆదేశించారు.ఈ బృహత్తర ప్రణాళికల అమలుకు పూర్వోదయ, సాస్కీ, రాష్ట్ర ప్రభుత్వ నిధులను సమన్వయం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, పోర్ట్ కనెక్టివిటీ, గోదాములు, కోల్డ్ చైన్ వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

10 జిల్లాల్లో ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయనున్న ఇరిగేషన్ ప్రాజెక్టుల వివరాలు:

- వెలిగొండ ప్రాజెక్ట్
- కొరిశపాడు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం
- పాలేరు రిజర్వాయర్
- మల్లెమడుగు లిఫ్ట్-రిజర్వాయర్
- శ్రీ బాలాజీ రిజర్వాయర్
- c కుప్పం బ్రాంచ్ కెనాల్
- పుంగనూరు బ్రాంచ్ కెనాల్
- మూలపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం
- హంద్రీ-నీవా ప్రధాన కాల్వ పనులు
- అట్లూరుపాడు-మేర్లపాక ఎస్ఎస్ఎల్సీ
- నీవా బ్రాంచ్ కెనాల్ పనులు
- జీడిపల్లి-భైరవానితిప్ప లిఫ్ట్ ఇరిగేషన్ పథకం
- జీడిపల్లి-అప్పర్ పెన్నార్ ఎత్తిపోతలు
- అనంతలో కమ్యూనిటీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్
- మడకశిర బ్రాంచ్ కెనాల్ విస్తరణ పనులు
- పేరూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం
- కడప, కోడూరు వరకు గాలేరు-నగరి సుజల స్రవంతి
- అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్దరణ పనులు
- పశ్చిమ కర్నూలుకు నీళ్లిచ్చేలా వేదవతి-అలగనూరు-గాజులదిన్నె ప్రాజెక్టులు
- ఏడు జిల్లాల్లో 1,011 మైనర్ ఇరిగేషన్ చెరువుల అభివృద్ధి

## పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు

**మొదటిపేజీ తరువాయి** – అభివర్ణించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నూతనంగా నియమితులైన పార్లమెంట్ కమిటీల కోసం ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను ఆయన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేశ్ పార్టీ నేతలను ఉద్దేశించి ప్రసంగించారు.పార్టీ కార్యకర్తలు, నాయకులు పార్టీ కార్యాలయానికి తగిన సమయం కేటాయించాలని లోకేశ్ సూచించారు. "పార్టీ మన సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు లాంటిది. చంద్రబాబుకి ఎంత పని ఒత్తిడి ఉన్నా వారానికి ఒకసారి పార్టీ ఆఫీసుకు వచ్చి కార్యకర్తలను కలుస్తున్నారు, శిక్షణ కార్యక్రమాలకు హాజరవుతున్నారు" అని గుర్తుచేశారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వం ఉందని, కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసికట్టుగా రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. కేంద్ర సహకారంతోనే విశాఖ ఉక్కును కాపాడుకోగలిగామని, అమరావతి, పోలవరం పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. త్వరలోనే కర్నూలుకు హైకోర్టు బెంచ్ కూడా తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

**అభివృద్ధికి ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం**

పార్టీ నాయకులు చిన్న చిన్న అలకలు వీడి ఐక్యంగా పనిచేయాలని లోకేశ్ పిలుపునిచ్చారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మనపై ఎన్నో అక్రమ కేసులు పెట్టారు. ఇప్పుడు అలకల వల్ల మనమే నష్టపోతాం. ఏదైనా సమస్య ఉంటే పార్టీలోనే పోరాడాలి" అని హితవు పలికారు. కనీసం 15 ఏళ్ల పాటు కూటమి ప్రభుత్వం అధికారంలో కొనసాగితేనే రాష్ట్రాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేసుకోగలమని పవన్ కల్యాణ్ కూడా చెప్పారని గుర్తుచేశారు. కూటమిలో చిన్న చిన్న సమస్యలు సహజమని, వాటిని పరిష్కరించుకుని ముందుకు సాగాలన్నారు. మన మధ్య విభేదాలు సృష్టించడానికి వైసీపీ ప్రయత్నిస్తుందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

**పదవిని బాధ్యతగా స్వీకరించాలి**

వ్యక్తులు శాశ్వతం కాదని, తెలుగుదేశం పార్టీయే శాశ్వతమని లోకేశ్ స్పష్టం చేశారు. "ఒక వ్యవస్థ కింద మనం అందరం నడుచుకోవాలి. పదవిని బాధ్యతగా స్వీకరించాలి. పార్టీ వ్యవస్థను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఒక కార్యకర్తగా పనిచేస్తున్నా" అని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, పార్టీ కార్యక్రమాలను 'మై టీడీపీ యాప్' ద్వారానే చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ తరగతులు నిరంతర ప్రక్రియ అని, అందరూ కలిసికట్టుగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. అనంతరం, ఆయన స్వయంగా శిక్షణ తరగతులకు హాజరై, వెనుక వరుసలో కూర్చుని ఒక నిత్య విద్యార్థిలా పాఠాలు వినడం అందరినీ ఆకట్టుకుంది.

**స్వయంగా ఆహ్వానం పలికిన మంత్రి లోకేశ్**

అంతకుముందు, వర్క్‌షాప్‌కు హాజరైన పార్లమెంట్ కమిటీ సభ్యులకు మంత్రి లోకేశ్ స్వయంగా ఎదురెళ్లి స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి వారితో ఫోటోలు దిగారు. ఇదే సమయంలో, నారా లోకేశ్ 'యువగళం' పాదయాత్రకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో వేడుకలు జరిగాయి. పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## కేంద్రానికి ధర్మాన లేఖ రాయడం సిగ్గుచేటు

**మొదటిపేజీ తరువాయి** – వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ఒక అత్యంత దుర్మార్గమైన చట్టమని, దీని ద్వారా జగన్ ప్రభుత్వం సామాన్యుల ఆస్తి హక్కులను బలిపీఠం ఎక్కించిందని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఈ చట్టాన్ని రద్దు చేసిందని, దీనిపై మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు కేంద్రానికి లేఖ రాయడం సిగ్గుచేటని విమర్శించారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.నీతి ఆయోగ్ సూచనలకు విరుద్ధంగా వైసీపీ ప్రభుత్వం ప్రజల హక్కులను హరించేలా చట్టంలో మార్పులు చేసిందని సోమిరెడ్డి ఆరోపించారు. కేంద్రం 'ప్రభుత్వ అధికారులను' నియమించమంటే, వైసీపీ 'ఏ వ్యక్తినైనా' అనే పదం చేర్చి తమకు అనుకూలమైన రిటైర్డ్ అధికారులను కీలక పోస్టుల్లో కూర్చోబెట్టిందని విమర్శించారు.భూ వివాదాల పరిష్కారానికి దశాబ్దాలుగా ఉన్న సివిల్ కోర్టుల అధికారాన్ని ఈ చట్టం తొలగించి, సర్వాధికారాలను టైటిల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (టీఆర్ఓ) చేతిలో పెట్టిందని మండిపడ్డారు. దీనివల్ల ఓ సామాన్య రైతు తన భూమి కోసం నేరుగా హైకోర్టుకు వెళ్లాల్సిన దుస్థితి కల్పించారని, ఇది పేదలకు ఉరితాడు వేయడమేనని అన్నారు. యజమాని దగ్గర ఉన్న ఒరిజినల్ డాక్యుమెంట్లకు విలువ లేకుండా చేసి, ఆన్‌లైన్ రికార్డులే ప్రామాణికమనడం వెనుక భూములను కబళించే భారీ కుట్ర దాగి ఉందని ఆరోపించారు.రీ-సర్వే పేరుతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది ఎకరాలను 22ఏ జాబితాలో చేర్చారని సోమిరెడ్డి పేర్కొన్నారు. తన సొంత నియోజకవర్గమైన సర్వేపల్లిలో అప్పటి మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అనుచరులు వేల ఎకరాలను వివాదాల్లోకి నెట్టారని, ఈ అక్రమాల వల్లే నలుగురు తహసీల్దార్లు సస్పెండ్ అయ్యారని గుర్తుచేశారు. పొదలకూరు మండలంలోని మర్రిపల్లి గ్రామంలో 566 ఎకరాలు, పర్లపల్లిలో 445 మంది రైతులకు చెందిన 254 ఎకరాలను అన్యాయంగా వివాదాస్పదం చేశారని గణాంకాలతో సహా వివరించారు. "మా తాతలు సంపాదించిన ఆస్తులపై జగన్ ఫోటో ఏంటి? ఇది నియంతృత్వ ధోరణి కాదా?" అని ఆయన ప్రశ్నించారు. రీ-సర్వే పేరుతో రూ.700 కోట్లను కేవలం పాస్‌బుక్‌లు, సర్వే రాళ్లపై జగన్ బొమ్మల కోసం దుర్వినియోగం చేశారని విమర్శించారు.రైతు కుటుంబం నుంచి వచ్చిన ధర్మాన ప్రసాదరావు, బ్రిటిష్ చట్టాల కన్నా దారుణంగా ఉన్న ఈ చట్టాన్ని ఎలా సమర్థిస్తారని సోమిరెడ్డి నిలదీశారు. ధర్మాన లేఖపై కేంద్రం లోతుగా విచారణ జరిపితే వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాల పాపాలు బయటపడతాయని హెచ్చరించారు. భూ యజమానుల ఒరిజినల్ పత్రాలను ఏదో ప్రైవేట్ కంపెనీ ద్వారా అమెరికా సర్వర్లలో దాచాలనే ఆలోచన ప్రమాదకరమని అన్నారు. ఇలాంటి దుర్మార్గమైన చట్టాలు, భూ కబ్జాల వల్లే ప్రజలు వైసీపీని 11 సీట్లకే పరిమితం చేశారని ఎద్దేవా చేశారు.కూటమి ప్రభుత్వం ఇప్పటికే పొదలకూరు మండలంలోని అక్రమాలపై జాయింట్ కలెక్టర్ ద్వారా విచారణ జరిపిస్తోందని, బాధితులకు న్యాయం చేసి వారి భూములపై పూర్తి హక్కులు కల్పిస్తామని సోమిరెడ్డి స్పష్టం చేశారు.

## వరుసగా 9వసారి బడ్జెట్- చరిత్ర సృష్టించనున్న నిర్మలమ్మ

**మొదటిపేజీ తరువాయి** – మరింత దగ్గరవుతారు నిర్మలా సీతారామన్. దేశాయ్ మొత్తం 10 బడ్జెట్‌లు ప్రవేశపెట్టిన రికార్డు ఇప్పటికీ అగ్రస్థానంలో ఉంది. అయితే వరుసగా తొమ్మిది బడ్జెట్‌లు ప్రవేశపెట్టిన ఘనత మాత్రం నిర్మలా సీతారామన్‌కే దక్కనుంది.స్వాతంత్ర్యం తర్వాత తొలి కేంద్ర బడ్జెట్‌ను 1947 నవంబర్ 26న దేశ తొలి ఆర్థిక మంత్రి ఆర్.కె. షణ్ముఖం శెట్టి ప్రవేశపెట్టారు.ఎక్కువ బడ్జెట్‌లు ప్రవేశపెట్టిన నేత : మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ అత్యధికంగా 10 బడ్జెట్‌లు ప్రవేశపెట్టారు. 1959 నుంచి 1969 మధ్య కాలంలో వివిధ ప్రభుత్వాల్లో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తూ రికార్డు సృష్టించారు. పి.చిదంబరం తొమ్మిది సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. 1996లో మొదటిసారి బడ్జెట్ పెట్టిన ఆయన, యూపీఏ ప్రభుత్వ హయాంలో ఐదు వరుస బడ్జెట్‌లు ప్రవేశపెట్టారు. 2013, 2014లో మరో రెండు బడ్జెట్‌లు సమర్పించారు.ప్రణబ్ ముఖర్జీ ఎనిమిది బడ్జెట్‌లు ప్రవేశపెట్టారు. 1982 నుంచి 1984 వరకు మూడు, 2009 నుంచి 2012 వరకు ఐదు వరుస బడ్జెట్‌లు సమర్పించారు. 1991 నుంచి 1995 వరకు ఐదు వరుస బడ్జెట్‌లు ప్రవేశపెట్టారు. ఆర్థిక సంస్కరణలతో ఈ కాలం చరిత్రలో ప్రత్యేక స్థానం దక్కించుకుంది.2020 ఫిబ్రవరి 1వ తేదీన నిర్మలా సీతారామన్ చేసిన బడ్జెట్ ప్రసంగం రెండు గంటల 40 నిమిషాలు సాగి రికార్డు సృష్టించింది. చివరికి రెండు పేజీలు మిగిలి ఉండగానే ప్రసంగాన్ని ముగించారు.అత్యంత చిన్న ప్రసంగం : 1977లో హీరుభాయ్ ముల్జీభాయ్ పటేల్ చేసిన మధ్యంతర బడ్జెట్ ప్రసంగం కేవలం 800 పదాలతోనే ముగిసింది.బ్రిటీష్ కాలం నుంచి సంప్రదాయంగా ఫిబ్రవరి చివరి రోజున సాయంత్రం 5 గంటలకు బడ్జెట్ ప్రవేశపెట్టేవారు. లండన్ సమయానికి అనుగుణంగా ఆ విధానం కొనసాగింది. అయితే 1999లో అప్పటి ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా ఉదయం 11 గంటలకు బడ్జెట్ ప్రవేశపెట్టే పద్ధతిని ప్రారంభించారు. అప్పటి నుంచి ఇదే సమయం కొనసాగుతోంది. 2017లో మరో కీలక మార్పు చేశారు. బడ్జెట్ తేదీని ఫిబ్రవరి 1కి మార్చారు. దీని వల్ల ఏప్రిల్ 1 నుంచే కొత్త ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అమలు చేసే అవకాశం ఏర్పడింది. ఈసారి ఆదివారం అయినా కూడా ఫిబ్రవరి 1నే బడ్జెట్ ప్రవేశపెడుతున్నారు నిర్మలమ్మ.మరోవైపు, ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో నిర్మలా సీతారామన్ మంగళవారం హల్వా వేడుకను నిర్వహించారు. భారత్‌లో ఏ మంచి కార్యక్రమం ప్రారంభించినా ముందుగా తీపి పదార్థాలు పంచడం శుభప్రదంగా భావిస్తారు. అందుకే ఏటా బడ్జెట్‌కు ముందు సంప్రదాయం ప్రకారం, ఢిల్లీలోని కేంద్ర ఆర్థిక శాఖ కార్యాలయం- నార్త్ బ్లాక్‌లో హల్వా వేడుక చేస్తుంటారు. బడ్జెట్ తయారీ ప్రక్రియలో పాల్గొనే అధికారులకు, సిబ్బందికి ఆ హల్వాను పంచిపెడతారు.హల్వా వేడుకతో బడ్జెట్ లాక్-ఇన్ పీరియడ్ ప్రారంభం అవుతుంది. అంటే బడ్జెట్ తయారీలో ప్రత్యక్షంగా పాల్గొనే అధికారులు, సిబ్బంది – పార్లమెంట్‌లో దానిని ప్రవేశపెట్టేవరకు ఆ నార్త్ బ్లాక్‌లోనే ఉంటారు. వారు బయటకు వెళ్లడానికి వీలుండదు. వారు ఎల్లప్పుడూ సీసీటీవీ కెమెరాలు, ఇంటెలిజెన్స్ బ్యూరోల నిరంతర పర్యవేక్షణలో ఉంటారు. కనీసం వారు ఫోన్ చేయడానికి కూడా వీలుండదు. అత్యవసర సమయాల్లో మాత్రం భద్రతా సిబ్బంది సమక్షంలో ఫోన్ చేసుకునే వీలు కల్పిస్తారు. మొదట్లో రాష్ట్రపతి భవన్‌లోనే బడ్జెట్ ప్రతులను ముద్రించేవారు. కానీ 1950లో బడ్జెట్లోని అధిక భాగం ముద్రణ ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో లీక్ అయ్యింది. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. దీనితో అప్పటి ఆర్థిక మంత్రి జాన్ మథాయ్ బడ్జెట్ సమర్పించిన కొద్ది సేపటి తర్వాత రాజీనామా చేశారు. ఆ ఘటన తరువాత బడ్జెట్ ముద్రణను – మింటో రోడ్‌లోని ప్రభుత్వ ప్రెస్‌కు మార్చారు. దాని తరువాత లాక్- ఇన్ వ్యవధిని కూడా ప్రవేశపెట్టారు. వాస్తవానికి హల్వా వేడుకను కచ్చితంగా ఏ సంవత్సరంలో ప్రవేశపెట్టారో తెలియదు. కానీ దాదాపు 1950ల్లోనే ఇది ప్రారంభమైనట్లు భావిస్తున్నారు.

## తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

**మొదటిపేజీ తరువాయి** – ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు జరగనుంది. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో ఎన్నికలు జరగనున్నాయి.నేటి నుంచి ఈనెల 30 వరకు నామినేషన్ల స్వీకరించనున్నట్లు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ వివరాలు

- నేటి నుంచి ఈ నెల 30 వరకు నామినేషన్ల స్వీకరణ
- 31న అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన
- నామినేషన్ల ఉపసంహరణకు ఫిబ్రవరి 3 వరకు గడువు
- ఫిబ్రవరి 11న పోలింగ్
- రీపోలింగ్ ఎక్కడైనా ఉంటే ఫిబ్రవరి 12న నిర్వహణ
- ఫిబ్రవరి 13న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు
- ఫిబ్రవరి 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక
- ఫిబ్రవరి 16న కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక
- తెలంగాణలో 116 మున్సిపల్ స్థానాలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు
- రాష్ట్రంలో మొత్తం 2,996 వార్డులు, డివిజన్లకు ఎన్నికలు
- ఓటుహక్కు వినియోగించుకోనున్న 52.43 లక్షల మంది ఓటర్లు
- 26.80 లక్షల మహిళా ఓటర్లు, 25.62 లక్షల పురుష ఓటర్లు, 600 ఇతరులు
- పోలింగ్ కేంద్రాలు 8,203, లెక్కింపు కేంద్రాలు 136, బ్యాలెట్ బాక్సులు 16,301

రాష్ట్రంలో అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్

మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల - ఫిబ్రవరి 11న పోలింగ్, 13న కౌంటింగ్

"116 మున్సిపల్ స్థానాలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లు, గడువు ముగిసిన వాటిని, కొత్తగా ఏర్పడిన వాటికి ఈ ఎన్నికలు జరగనున్నాయి. రేపటి నుంచి నామినేషన్లు మొదలవుతాయి. 11వ తేదీన పోలింగ్ ఉంటుంది. 13వ తేదీన కౌంటింగ్ ఉంటుంది'.మొత్తం 52.43 లక్షల ఓటర్లు : ఈ నెల 31న అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన ఉంటుందని కమిషనర్ తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణకు ఫిబ్రవరి 3 వరకు గడువు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల కోసం ఇప్పటికే దాదాపు ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు.ఫిబ్రవరి 16న కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ల ఎన్నిక ఉంటుందని రాణి కుముదిని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మొత్తం 2,996 వార్డులు, డివిజన్లకు ఎన్నికలు జరగనుండగా, 8,203 పోలింగ్ కేంద్రాలు, 136 లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో సీఎస్, డీజీపీ సహా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.మున్సిపల్ ఎన్నికల్లో వివిధ వర్గాలకు రిజర్వేషన్ స్థానాలను పరిశీలిస్తే బీసీ జనరల్- 463, బీసీ మహిళలు- 391, ఎస్సీ జనరల్- 254, ఎస్సీ మహిళలు- 190, ఎస్టీ జనరల్- 147, ఎస్టీ మహిళలు- 40, జనరల్ వార్డులు- 647, జనరల్ మహిళలకు రిజర్వ్ వార్డులు- 864గా ఉన్నాయి. ఇవాళ ఎస్ఈసీ రాణి కుముదిని ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో సీఎస్ రామకృష్ణారావు, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీదేవి, డీజీపీ శివధర్‌రెడ్డి, అదనపు డీజీ మహేశ్ భగవత్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.అధికార కాంగ్రెస్, ప్రతిపక్షాలు బీఆర్ఎస్, బీజేపీలు హోరాహోరీగా తలపడే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో పెద్ద మొత్తంలో సీట్లు గెలుచుకున్న బీఆర్ఎస్ ప్రస్తుత ఎన్నికల్లో రకరకాల వ్యూహాలను రచిస్తోంది. ఈ బాధ్యతను ముఖ్యంగా కేటీఆర్ తీసుకోనున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. కాంగ్రెస్ నుంచి ఇప్పటికే ముఖ్యమంత్రి కొన్ని జిల్లాల్లో ఏకంగా బహిరంగ సభలే నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తేనే వేగంగా అభివృద్ధి జరుగుతుందని ప్రజలను కోరారు. ఇక బీజేపీ కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలతో ప్రచారం చేయాలని చూస్తోంది.

# గ్రామాభివృద్ధే లక్ష్యం  మంత్రి పొన్నం ప్రభాకర్

**బతుకమ్మ పండుగకు శాశ్వత స్థలం**

**40 లక్షల విలువైన భూమి దానం ఇచ్చిన లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి**





**భీమదేవరపల్లి, జనవరి 27 (ప్రజా మంటలు) :** రంగయ్యపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం రంగయ్యపల్లి గ్రామ పంచాయతీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గ్రామంలో రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన నిధులను దశలవారీగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని 172 గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తోందని ప్రజాప్రతినిధులు తెలిపారు. రైతులు, మహిళా సంఘాలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పలు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఇదే కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పరిధిలో బతుకమ్మ పండుగ సందర్భంగా బతుకమ్మ ఆడుకునేందుకు లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి 40 లక్షల రూపాయల విలువైన 33 గుంటల సొంత భూమిని విరాళంగా అందించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం కోసం సొంత భూమిని విరాళంగా ఇవ్వడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మండల రజనీ మహేష్, వంగర గ్రామ సర్పంచ్ గజ్జల సృజన రమేష్, జమ్మల భీంరెడ్డి, బొమ్మ శ్రీరామ్, మండల అధ్యక్షుడు చిట్టెంపల్లి ఐలయ్య, మూస కోయిల ప్రకాష్, ఆదరి రవీందర్‌తో పాటు గ్రామ పెద్దలు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

## భవిష్యత్తు ఉన్న యువకుడి ప్రాణాలు తీసిన ఆన్లైన్ బెట్టింగ్

**బెట్టింగ్ మృత్యువు బాధాకరం  జేఏసీ నాయకులు**



**భీమదేవరపల్లి, జనవరి 27 (ప్రజా మంటలు) :** మండలంలోని ముల్కనూర్ గ్రామానికి చెందిన సుంచు రామ్ చరణ్ (23) ఆన్లైన్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకొని ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై విచారం వ్యక్తం చేసిన జేఏసీ, డ్రగ్స్ నిర్మూలన పోరు యాత్ర నాయకులు మంగళవారం ముల్కనూర్ గ్రామంలో రామ్ చరణ్ కుటుంబాన్ని పరామర్శించారు. బాధతో రోదిస్తున్న కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు. అనంతరం హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ కోఆర్డినేటర్ దేగల సారయ్య మాట్లాడుతూ, భవిష్యత్తు ఉన్న యువకుడు ఆన్లైన్ బెట్టింగ్ కారణంగా ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. యువత ఆన్లైన్ బెట్టింగ్ ఆటలకు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆన్లైన్ బెట్టింగ్, మత్తుపదార్థాల వల్ల యువత జీవితాలు నాశనమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మంచి సమాజ నిర్మాణానికి యువత ఆదర్శంగా నిలవాలని సూచించారు. సైబర్ నేరస్తులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, డ్రగ్స్ నిర్మూలనలో ఉక్కు పాదం మోపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కొడుకు, కోడలిని అనారోగ్యంతో కోల్పోయి, తాజాగా మనవడిని కూడా కోల్పోయిన మధురమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ, డ్రగ్స్ నిర్మూలన పోరు యాత్ర నాయకులు గాండ్ల పద్మ, డాక్టర్ ఎదులాపురం తిరుపతి, మాట్ల వెంకటస్వామి, వేముల జగదీష్, దస్తరి ఉమామహేశ్వర్, రేణికుంట్ల బిక్షపతి, వార్డు సభ్యులు సుంచు చంద్రమౌళి, ముదిరాజ్ సంఘం డైరెక్టర్ సుంచు రాంబాబు, ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గుంపుమేస్త్రికి ప్రధాన గూఢచారి సంతోష్ రావు : కవిత ఆరోపణ



**హైదరాబాద్, జనవరి 27 (ప్రజా మంటలు) :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాల నుంచి దూరం చేయడానికి సంతోష్ రావే ప్రధాన కారణమని జాగృతి నేత కల్వకుంట్ల కవిత ఆరోపించారు.కేసీఆర్ ఫార్మ్ హౌస్‌లో ఇడ్లి తిన్నారా? సగం తిన్నారా? అన్న సమాచారం కూడా గుంపుమేస్త్రికి చేరేలా చేసిన వ్యక్తి సంతోష్ రావేనని విమర్శించారు.గద్దర్ వంటి ఉద్యమ నాయకులు గంటల తరబడి గేట్ బయట వేచి ఉండే పరిస్థితి, ఈటల రాజేందర్ బయటకు రాలేని పరిస్థితికి సంతోష్ రావే కారణమన్నారు.సంతోష్ రావును సిట్ పిలవటం మంచిదేనని, కానీ రాజకీయ ఒత్తిళ్ల వల్ల ఆయనకు శిక్ష పడే అవకాశాలు తక్కువేనని వ్యాఖ్యానించారు.ఇలాంటి వ్యక్తికి కేటీఆర్, హరీష్ రావులు ఎందుకు మద్దతు ఇస్తున్నారో అర్థం కావటం లేదని ప్రశ్నించారు.డ్రగ్స్‌గంజాయి మాఫియాపై తీవ్ర విమర్శ డ్రగ్స్, గంజాయి మాఫియా గ్రామాలు, స్కూల్స్ వరకూ విస్తరించిందని, మహిళలు, పిల్లలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

**ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి అండ**

నిజామాబాద్‌కు చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య గారి పరిస్థితి ఇంకా క్రిటికల్‌గా ఉన్నప్పటికీ కొంత మెరుగుదల ఉందన్నారు. ఆమె కుటుంబానికి జాగృతి తరఫున పూర్తి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. డ్రగ్స్, గంజాయి మాఫియాను అరికట్టేందుకు ఎక్సైజ్, ఫారెస్ట్ సిబ్బందికి ఆయుధాలు, సరైన రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# బీసీ కులగణన అవసరం

**జనగణనపై జాగృతి రౌండ్ టేబుల్**



**హైదరాబాద్, జనవరి 27 (ప్రజా మంటలు) :** ఈ నెల 29న కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే జనగణన నేపథ్యంలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు నవీన్ ఆచారి తెలిపారు.బీసీలకు దశాబ్దాలుగా అన్యాయం జరుగుతోందని, దేశవ్యాప్తంగా పకడ్బందీ కులగణన జరగాలని డిమాండ్ చేశారు.ఒకే కులానికి భిన్న పేర్లు, వలస కులాల సమస్యలపై స్పష్టమైన విధానం అవసరమన్నారు.

**కవిత నేతృత్వం :** కవిత ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో బీసీ మేధావులు, కుల సంఘాల నాయకులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేయాలని పిలుపునిచ్చారు.

**కేంద్రానికి నివేదిక :** సమావేశంలో వచ్చిన అభిప్రాయాలను సమీకరించి కేంద్రానికి నివేదికగా ఇవ్వనున్నట్లు తెలిపారు.

## జగిత్యాల అభివృద్ధి కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నాం

**ఎమ్మెల్యే సంజయ్**



**జగిత్యాల, జనవరి 27 (ప్రజా మంటలు) :** జగిత్యాల పట్టణ అభివృద్ధి ధ్యేయంగా బీఆర్ఎస్‌లో గెలిచి ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ స్పష్టం చేశారు.రాష్ట్రంలోనే అత్యధికంగా జగిత్యాలకు రూ.62.5 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. గత అధికారుల నిర్లక్ష్యంతో మాస్టర్ ప్లాన్ లేక ఇష్టారీతిన నిర్మాణాలు జరిగాయని విమర్శించారు.

**అభివృద్ధికి అడ్డంకులు**

ఎల్ఎల్ గార్డెన్ సీసీ రోడ్డుకు భూమి పూజ చేసినా కొందరు సీనియర్ నాయకులు విమర్శలు చేసి అభివృద్ధిని అడ్డుకున్నారని ఆరోపించారు. కాలువల కబ్జాలు, రోడ్డు సమస్యలు గత పాలనల కాలంలోనే జరిగాయని తెలిపారు.

**ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌పై వివరణ**

జగిత్యాలలో మాత్రమే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పూర్తి చేసి ప్రారంభించామని, కాంట్రాక్టర్‌కు రూ.9 కోట్లు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. అవగాహన లేకుండా విమర్శలు చేస్తున్నారని అన్నారు.

**యావర్ రోడ్డు, హౌసింగ్ అభివృద్ధి**

యావర్ రోడ్డు 900 మీటర్లు, 100 ఫీట్ల వెడల్పుతో విస్తరణ చేశామని, నూకపల్లి ఇందిరమ్మ కాలనీలో 4,500 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, రూ.34 కోట్లతో మౌలిక వసతులు కల్పించామని తెలిపారు.

**అసత్య ప్రచారాలపై ఖండన**

కవిత ఓటమికి తానే కారణమన్న ఆరోపణలు అసత్యమని, తన లక్ష్యం అభివృద్ధే తప్ప రాజకీయ కుతంత్రాలు కాదన్నారు.

**అవినీతి ఆరోపణలకు సమాధానం**

మున్సిపాలిటీలో అవినీతి చేసిన అధికారులు జైలుకు వెళ్లడం, సస్పెన్షన్లు జరిగాయని, తనకు అవినీతితో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

**రాబోయే పనులు :** త్వరలో ధర్మపురి రోడ్డులో గంగపుత్రుల కోసం స్ట్రీట్ వెండింగ్ జోన్ షాపులు ఏర్పాటు చేస్తామని, టెండర్లు ఇంకా ఓపెన్‌లో ఉన్నాయని తెలిపారు.

## యువత కోసం యువ మండల్ వికాస్ అభియాన్



**గొల్లపల్లి ధర్మారం జనవరి 27 ప్రజా మంటలు :** గ్రామీణ యువతను ఏకం చేసి వారిని అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా 'మై భారత్  పెద్దపల్లి, యువశక్తి యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ పత్తిపాక  వారి ఆధ్వర్యంలో "యువ మండల్ వికాస్ అభియాన్" కార్యక్రమాన్ని 5 రోజులలో 50 గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారం ఎంపీడీఓ ఆవరణలో  యువజన నాయకులకు యూత్ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా డివైఓ వెంకట రాంబాబు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ఉన్న యువజన సంఘాలను బలోపేతం చేయడమే లక్ష్యం అని తెలిపారు. ఇప్పటివరకు యువజన సంఘాలు లేని ప్రాంతాల్లో నూతన. సంఘాలను ఏర్పాటు చేసి, వారిని 'మై భారత్ కరీంనగర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా విభాగాలకు అనుసంధానం చేయనున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల భవిష్యత్తులో మై భారత్ నిర్వహించే ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో గ్రామీణ యువత చురుగ్గా పాల్గొనే అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆర్గనైజర్ రేషవేణి మహేష్ యువశక్తి యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రేషవేణి సిద్ధార్థ ఉపాధ్యక్షులు రాహుల్ కార్యదర్శి సోను రిషి ఆదర్శ్ రాకేష్ ఇర్ఫాన్ నితిన్ యువజన సంఘాల నాయకులు ధీరజ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# 2027 డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు నాటి నుండి నేటి వరకు పట్టించుకోని పాలకులు





**గొల్లపల్లి జనవరి 27 ప్రజా మంటలు :** 18 సం, క్రితం నుండి మట్టితో కూడుకుపోయి డ్రైనేజీ వ్యవస్థ ను నేడు శ్రీకారం చేపట్టారు గ్రామ అభివృద్ధి కొరకై ముందడుగు వేస్తున్న సర్పంచ్  నల్ల నీరజ సతీష్ రెడ్డి ,నూతన పాలకవర్గం గొల్లపల్లి మండల కేంద్రంలో ప్రధాన మెయిన్ రోడ్డు ఆనుకొని ఉన్న  నల్లగుట్ట నుండి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ స్టేషన్  పోలీస్ స్టేషన్ మండల ప్రజా పరిషత్ తాసిల్దార్ పంచాయతీ కార్యాలయం వరకు 18సం ,క్రితం డ్రైనేజ్ నిర్మాణం చేపట్టారు అప్పటి నుండి ఇప్పటి వరకు మట్టితో కూడుకుపోయి  ఉన్న డ్రైనేజ్ పట్టించుకోని పాలకులు వర్షపు నీళ్లు రోడ్డుపై వచ్చి ఇసుక మేటల తో  వాహనదారులకు రోడ్డు  ప్రమాదాలు ఎన్నో జరిగిన సందర్భాలు ఉన్నాయి  దాని దృష్టిలో పెట్టుకొని  నేడు డ్రైనేజ్ పూడిక  శ్రీకారం చేపట్టారు గతంలో వర్షాకాలంలో రోడ్డుపై వర్షపు నీరు నిలిచి షాపులోకి చేరి వ్యాపారస్తులు  నష్టపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి ఇట్టి విషయాన్ని సర్పంచ్ పాలకవర్గానికి పంచాయతీ కార్యదర్శి  దృష్టికి తీసుకెళ్లగా మంగళవారం డ్రైనేజ్ పూడిక శ్రీకారం చేపట్టారు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ముందుకు వచ్చిన సర్పంచ్ నల్ల నీరజ సతీష్ రెడ్డి ,ఉపసర్పంచ్ ,బుచ్చిరెడ్డి పాలకవర్గానికి పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డికి, వాహనదారులు పాదాచార్యులు వ్యాపారస్తులు యువకులు  గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మేడారం మహా జాతర పోస్టర్ ఆవిష్కరణ



**జగిత్యాల జనవరి 27 ( ప్రజా మంటలు) :** కలెక్టరేట్ లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మేడారం మహా జాతర పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్.సమ్మక్క, సారలమ్మ వన దేవతల మేడారం మహా జాతర జనవరి 28 నుండి 31 వరకు జరగనున్న నేపథ్యంలో దర్శనాలకు వచ్చే ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.జిల్లా నుండి ఆర్.టి.సి బస్ లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.వన దేవతల దర్శనాలకు వెళ్లే భక్తులు జాగ్రత్తగా వెళ్లి భక్తి శ్రద్ధలతో దేవతల కృప పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి కె. రాజ్ కుమార్, మరియు తదితరులు పాల్గొన్నారు.

# రికన్సిలియేషన్ ను త్వరగా పూర్తి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి. ఎస్ లత**



**జగిత్యాల జనవరి 27 ( ప్రజా మంటలు) :** జిల్లా అదనపు కలెక్టర్ అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించబడింది.ఈ సమావేశంలో ఖరీఫ్ 202526 మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వరి మరియు గన్నీ సంచుల రీకన్సిలియేషన్ అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఖరీఫ్ 202526 సీజన్‌కు సంబంధించిన వరి మరియు గన్నీ సంచుల రీకన్సిలియేషన్ పనులను ఈ నెల జనవరి చివరి నాటి వరకు తప్పనిసరిగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి. ఎస్ లత  జిల్లా సహకార అధికారి మరియు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులకు స్పష్టమైన సూచనలు ఇస్తూ ఆదేశించారు. ఈ పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేదా ఆలస్యం జరగకుండా సంబంధిత శాఖల మధ్య పరస్పర సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా, రాబోయే రబీ 202526 మార్కెటింగ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని, వరి కొనుగోళ్లు సజావుగా జరిగేలా అన్ని విభాగాలు సమగ్రంగా సిద్ధంగా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి. ఎస్ లత సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రఘువరన్, జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్ మరియు జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి జితేందర్ రెడ్డి మరియు జిల్లా మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ఎన్ని గడించిన మనశ్శాంతి లేకపోతే జీవితం వ్యర్థం

**మాజీ మంత్రి జీవన్ రెడ్డి**



**జగిత్యాల జనవరి 27 (ప్రజా మంటలు) :** జిల్లా కేంద్రం గుట్ట రాజేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో, బ్రహ్మశ్రీ బుర్రా భాస్కర శర్మ చే, శ్రీ శివ మహాపురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞం,ఈరోజు  8, వ,రోజుకు చేరింది.  మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి భాస్కర శర్మ  ప్రవచనాలు విని బాస్క ర శర్మ చే ఘన సన్మానం అందుకున్నారు. జీవన్ రెడ్డి భాస్కర శర్మ ని శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ జీవితంలో ఎంత గడిం చిన,మనశ్శాంతి లేకుంటే వ్యర్థమని, ఆధ్యాత్మికం ప్రతి మనిషికి అవసరం అని, శివపురాణం వినేభాగ్యం మనకు అందరికీ కలగడం ఆనందంగా ఉందని అన్నారు. పురాణ ప్రవచకులు భాస్కర శర్మ ని బ్రహ్మశ్రీ గుండి శ్రీనివాస్ శర్మ చే లికించ బడిన, సన్మాన పత్రం గీత సత్సంగ్  కార్యదర్శి పాంపట్టి రవీందర్, నూనె కుమార్, ముఖ్య అతిథి జీవన్ రెడ్డి  చేతుల మీదుగా అందించి సన్మానించారు. కార్యక్రమం అనంతరం భక్తులందరికీ మహా అన్న ప్రసాదం అందించారు. దాదాపు 1500 మంది అన్న ప్రసాదం స్వీకరించారు. అన్న ప్రసాద సేవలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్,బట్టు రాజేందర్ ఆధ్వర్యంలో 45:మంది సత్యసాయి సేవా సమితి సభ్యులు సేవలందించారు. ఇదే కార్యక్రమంలో మహిళలు గోరింటాకు సంబరాలు జరుపుకున్నారు. ఈనాటి కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గుంటి జగదీశ్వర్, సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం, కార్యక్రమ నిర్వాహకులు, నరేందుల అమర్, చంద్రకళ, ఊటూరి  భాస్కర్, గంగ, ఊటూరి శంకర్రావు,ఉమాదేవి, ఊటూరి లక్ష్మీనరసింహారావు, శ్రీలత, ఊటూరి వేణుగోపాల్,విజయ వాణి, ఊటూరి హరీష్, కళ్యాణి, ఊటూరి గణేష్,శ్రీ వాణి, ఊటూరి మహేష్, విద్య, కొత్తపెల్లి శ్రీనివాస్, భవాని, మరియు భక్తులు   సామాజిక కార్యకర్త తౌటు రామచంద్రం పాల్గొన్నారు.

## మేడారం తర్వాత ముల్కనూర్ మినీ మేడారంగా జాతర

**అంగరంగ వైభవంగా సమ్మక్కసారలమ్మ జాతర**

**నేడే జాతర ప్రారంభం, గద్దెకు రానున్న సారలమ్మ**



**భీమదేవరపల్లి, జనవరి 27 (ప్రజా మంటలు) :** మండలం ముల్కనూర్ గ్రామ శివారులోని సమ్మక్క, సారలమ్మ జాతర 44 ఏళ్లుగా నిరంతరంగా కొనసాగుతూ భక్తుల విశేష ఆదరణ పొందుతోంది. 1982 లో ప్రారంభమైన ఈ జాతర, మేడారం తర్వాత గుర్తొచ్చే జాతరగా ప్రత్యేక గుర్తింపు సాధించింది. జంపన్న వాగు ఒడ్డున జరిగే ఈ ఉత్సవానికి ప్రతి ఏడాది వేలాది మంది భక్తులు తరలివస్తున్నారు. ఈనెల 28 న జాతర ప్రారంభమవుతుండగా, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, ఆలయ చైర్మన్ జక్కుల ఐలయ్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈసారి కూడా జాతర భక్తిశ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా సాగనుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# సంచర జాతుల వారికి ఆహారం పంపిణీ



**సికింద్రాబాద్, జనవరి 27 ( ప్రజా మంటలు) :** 77వ గణతంత్ర దినోత్సవాన్ని స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబెద్కర్‌కు నివాళులు అర్పించారు. నగరంలో రోడ్ల పక్కన జీవనం సాగిస్తున్న సంచార జాతుల కుటుంబాలను గుర్తించి వారికి ఆహారం అందించారు.దేశాభివృద్ధికి విద్యే ప్రధాన పునాది అన్న ఉద్దేశంతో సంచార జాతుల చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరుడికి ఆహారం, వైద్యం, విద్య అందాలన్న సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా చాటారు.ఈ కార్యక్రమంలో స్కై ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ. పావని పాల్గొన్నారు.

## గాంధీలో ఫిబ్రవరి 1,2 తేదీల్లో ఉచిత సీపీఆర్ శిక్షణ



**సికింద్రాబాద్, జనవరి 27 (ప్రజా మంటలు) :** గుండెపోటు వచ్చిన వ్యక్తికి వెంటనే సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని గాంధీ మెడికల్ కాలేజ్ ఆలుమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జి.ఆర్. లింగమూర్తి తెలిపారు.మంగళవారం జీఎంసీ ఆలుమ్ని ఎడ్యుకేషన్ సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆలుమ్ని డైరెక్టర్ డాక్టర్ పి. మహేశ్వర్ రెడ్డి, అమెరికా నుంచి వచ్చిన డాక్టర్ ఎస్. రవీందర్, జనహిత సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఎస్. నర్సింహమూర్తి, శ్రీధర్, డెన్నిస్ లు  పాల్గొన్నారు.గాంధీ మెడికల్ కాలేజ్ ఆలుమ్ని అసోసియేషన్, జీఎంసీ గ్లోబల్ అలయన్స్, జనహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1, 2 తేదీల్లో ఆలుమ్ని ఎడ్యుకేషన్ సెంటర్‌లో కమ్యూనిటీ సీపీఆర్‌పై రెండు రోజుల ఉచిత శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. గత 26 ఏళ్లుగా వేలాది మందికి ఉచితంగా సీపీఆర్ శిక్షణ అందించినట్లు వెల్లడించారు.ఈ శిబిరంలో 5,000 మందికి బొమ్మల సహాయంతో ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల నగర పౌరులు ఎవరైనా పాల్గొని ఉచితంగా శిక్షణ పొందవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు.

## మాజీ గ్రామ సర్పంచ్ సోలంకి రాజేశ్వర్ రావు పార్థివ దేహానికి ఆరె కులస్తుల నాయకులు నివాళి



**ఎల్కతుర్తి జనవరి 27 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన మాజీ గ్రామ సర్పంచ్ సోలంకి రాజేశ్వర్ రావు గత కొన్ని నెలల నుండి అనారోగ్యంతో బాధపడుతూ మరణించాడు. విషయం తెలుసుకున్న ఆరె కులస్తుల సంగం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన మాజీ చైర్మన్ ఆరెకుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నాగుర్ల వెంకన్న  తెలంగాణ రైతు రక్షణ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు, తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్, రాష్ట్ర కన్వీనర్ జెండా రాజేష్, రాష్ట్ర నాయకులు కౌడగాని నరసింహారావు, ఆరె కుల రాష్ట్ర కార్యదర్శి సుఖినే సంతాజి, ఆరె కుల జిల్లా సహాయ కార్యదర్శి అంబిర్ శ్రీనివాస్, ఆరె కుల మండల అధ్యక్షుడు కుడితాడి రాజు, బూర్గుల రామారావు, గ్రామ శాఖ అధ్యక్షుడు కథం రాజు, కారెట్లపల్లి నగేష్, మోరే బాబురావు, కారెట్లపల్లి రమేష్, సుకినే చిరంజీవి, వరికెల రాజేశ్వరరావు, అంబీర్ చంద్రావు, కార్యకర్తలతో కలిసి రాజేశ్వర్ రావు పార్థివ దేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించి అంత్రక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరె కులస్తుల సంఘం నాయకులు మాట్లాడుతూ, గ్రామాభివృద్ధి  ప్రజాసేవలో సోలంకి రాజేశ్వర్ రావు చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు ఆయన మరణం పట్ల గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు ఈ దుఃఖ సమయంలో వారి కుటుంబ సభ్యులకు ఆరె కులస్తుల తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## వివిధ రూపాల్లో కొనసాగనున్న కంటోన్మెంట్ విలీన పోరాటం

**రిలే నిరహార దీక్షకు భారీ స్పందన , దీక్ష ముగింపులో ఎమ్మెల్యే శ్రీగణేష్**



**సికింద్రాబాద్, జనవరి27 (ప్రజామంటలు) :** కంటోన్మెంట్ బోర్డును రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలనే డిమాండ్‌తో ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రారంభించిన రిలే నిరహార దీక్షను మంగళవారం ముగించారు. ఈ చివరి రోజు దీక్షకు తెలంగాణ ఫిషరీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, టీపీసీసీ జనరల్ సెక్రటరీలు నర్సారెడ్డి భూపతి రెడ్డి, పృథ్వీ చౌదరి, బీఎస్పీ నాయకులు రాజేందర్ హాజరై సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ... కంటోన్మెంట్ ప్రజల పోరాటానికి భారీ మద్దతు లభించిందని, ఈ ఉద్యమం భవిష్యత్తులో మరింత విస్తరించి వివిధ రూపాల్లో కొనసాగుతుందని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటం, తెలంగాణ ఉద్యమం తరహాలోనే ప్రజల మద్దతుతో కంటోన్మెంట్ విలీన పోరాటాన్ని విజయవంతం చేస్తామని స్పష్టం చేశారు.ఈ రిలే నిరహార దీక్ష ద్వారా కంటోన్మెంట్ ప్రాంతంలో ప్రజాస్వామ్య హక్కుల అంశం రాష్ట్ర, జాతీయ స్థాయిలో చర్చకు వచ్చిందని పేర్కొన్నారు. భవిష్యత్ కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ ఉద్యమానికి మద్దతుగా నిలిచిన నాయకులు, ప్రజా సంఘాలు, మేధావులు, కళాకారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్న భూఖ్య విటల్ రావు



**ఎల్కతుర్తి జనవరి 27 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలతో మమేకంగా పోలీస్ వృత్తిలో ఎంతో మంచి పేరు ప్రఖ్యాతి గాంచిన వ్యక్తిగా ఎల్కతుర్తి నుండి ఎంతో మంచి పేరు తెచ్చుకున్నందున కలెక్టర్ స్నేహసేబరి చేతుల మీదుగా ప్రశంస పత్రం అందజేయడం జరిగినది కమీషనర్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా విట్టల్ రావును అభినందించడం జరిగినది.

# 3 నెలల్లో 54 ప్రాజెక్టులకు శంకుస్థాపనలు

**సుమారు 1.24 లక్షల మందికి ఉపాధి**

**రూ.3.71 లక్షల కోట్ల పెట్టుబడులు**

**కార్యాచరణ సిద్ధం చేసిన అధికారులు**



ఒప్పందాలు కుదుర్చుకున్న కొన్ని ప్రాజెక్టుల గ్రౌండింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ ఏడాది మొదటి మూడు నెలల్లో 54 ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. వాటిలో ఇప్పటికే 8 కంపెనీలకు శంకుస్థాపనలు నిర్వహించారు. ఇంకా 41 కొత్త ఎంవోయూలు ఇప్పటికే ఉత్పత్తిలో ఉన్న 5 కంపెనీల విస్తరణ ప్రాజెక్టులు గ్రౌండింగ్ చేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. వాటి ద్వారా జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో రూ.3.71 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయి. సుమారు 1.24 లక్షల మందికి ఉపాధి కల్పించనున్నట్లు సంస్థలు దాఖలు చేసిన డీపీఆర్‌లో పేర్కొన్నాయి. 2024 జూన్ నుంచి ఆమోదించిన ప్రాజెక్టులు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పెట్టుబడుల ఆకర్షణపై దృష్టి పెట్టింది. ఈ ప్రయత్నాలతో వివిధ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. ఇప్పటి వరకు నిర్వహించిన 14 ఎస్ఐపీబీ సమావేశాల్లో వివిధ రంగాలకు చెందిన 211 కంపెనీల ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. వాటి ద్వారా రూ.8,74,705 కోట్ల పెట్టుబడులు 8,35,675 మందికి ఉపాధి కల్పించనున్నట్లు సంస్థలు డీపీఆర్‌లో తెలిపాయి. వాటిని దశల వారీగా గ్రౌండింగ్ చేసే చర్యలను ప్రభుత్వం చేపట్టింది. ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టుల్లో కొన్నింటిని గ్రౌండింగ్ (49 కొత్త ప్రాజెక్టులు 9 కంపెనీల విస్తరణ ప్రాజెక్టులు కలిపి) చేయడంపై అధికారులు దృష్టి సారించారు. ఆయా కంపెనీలకు అవసరమైన అనుమతులు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో ఇప్పటికే అందించారు. ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకున్న ఓ కొత్త ప్రాజెక్టుతో పాటు.. ఇప్పటికే రాష్ట్రంలో ఉత్పత్తిలో ఉన్న మరో మూడు కంపెనీల విస్తరణ ప్రాజెక్టులు పూర్తయ్యాయి. ఈ ఒప్పందాల ద్వారా రూ.3,707 కోట్ల పెట్టుబడులు 3,591 మందికి ఉపాధి కల్పించినట్లు సంస్థలు తెలిపాయి. కొత్తగా ఎంవోయూలు చేసుకున్న 7 సంస్థలు, మరో కంపెనీ విస్తరణ ప్రాజెక్టుకు అధికారులు శంకుస్థాపన పూర్తి చేశారు. ఈ ప్రతిపాదనల ద్వారా రూ.10,119 కోట్ల పెట్టుబడులు 13,091 మందికి ఉపాధి లభించనుంది. ఇంకా మిగిలిన 46 ప్రాజెక్టులకు (జనవరిలో 13, ఫిబ్రవరిలో 20, మార్చిలో 13 ప్రాజెక్టులు) శంకుస్థాపన నిర్వహించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇదిలా ఉండగా మరోవైపు పట్టణాల్లో మౌలిక వసతులు మరింత మెరుగు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మొత్తం రూ. 52 వేల కోట్ల అంచనాలతో అభివృద్ధి పనులకు ప్రణాళికలు రచిస్తోంది. తాగునీరు, రోడ్లు, ముగురుకాల్వలు, ప్రజారోగ్యం, వీధిదీపాలు, ఇలా వచ్చే 20 ఏళ్ల అవసరాలు తీర్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి రోడ్ మ్యాప్ రూపొందిస్తున్నాయి. పట్టణీకరణతో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా రహదారులు, వరద నీటి కాలువలు, తాగునీరు, వీధి దీపాలు, ప్రజారోగ్యం అంశాల్లో సౌకర్యాలు మెరుగు పరిచేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

# మేడారంలో న్యూజిలాండ్ 'హాకా'

**ఆకట్టుకున్న మావోరి తెగ కళాకారులు**

**మేడారాన్ని సందర్శించిన న్యూజిలాండ్‌కు చెందిన మావోరి తెగ కళాకారులు**

**గద్దెల ప్రాంగణంలో మావోరి తెగ సంప్రదాయ 'హాకా' నృత్యం ప్రదర్శన**

**మావోరి తెగ ప్రతినిధులను సన్మానించిన మంత్రి సీతక్క**



సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు భక్తులు పోటెత్తుతున్నారు. రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుంచి సైతం భక్తులు వచ్చి గద్దెలను దర్శించుకుంటున్నారు. మహాజాతర సందర్భంగా సోమవారం న్యూజిలాండ్‌కు చెందిన మావోరి తెగ కళాకారులు మేడారాన్ని సందర్శించారు. గద్దల ప్రాంగణంలో మావోరి తెగ వారి సంప్రదాయ నృత్యమైన హాకా నృత్యాన్ని ప్రదర్శించింది. ఈ 'హాక' నృత్యం అనేది మావోరి తెగలో యుద్ధానికి సిద్ధమయ్యే సమయంలో తమ సైనికుల్లో ఉత్సాహం నింపేందుకు, శత్రువుల్లో భయాన్ని కలిగించే విధంగా చేసే సంప్రదాయ నృత్యంగా చేస్తారని ప్రతినిధులు తెలిపారు. ఈ నృత్యంలో ముఖభావాలు, శరీర చలనలు అత్యంత ప్రభావవంతంగా ఉంటాయి. గద్దల ప్రాంగణంలో మావోరి తెగ సంప్రదాయ నృత్యం : తెలంగాణ-న్యూజిలాండ్ సాంస్కృతిక మార్పిడి కార్యక్రమంలో భాగంగా మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో మావోరి తెగ ప్రతినిధులు మేడారం జాతరకు సందర్శించారు. సీతక్క స్వయంగా కళాకారులతో కలిసి నృత్యం చేశారు. ఆదివాసీ సంస్కృతికి దేశ సరిహద్దులు, భాషలు అడ్డుకావని, ప్రపంచంలోని ఎక్కడైనా ఆదివాసీలు అడవి, ప్రకృతి మీదే ఆధారపడి జీవనం సాగిస్తారని మంత్రి సీతక్క మాట్లాడారు. అనంతరం న్యూజిలాండ్ చెందిన మావోరి తెగ కళాకారులకు సీతక్క వన దేవతల దర్శనం చేయించారు. వన దేవతల వైభవం, చరిత్రను స్వయంగా వారికి వివరించారు. ఈ సందర్భంగా బంగారం, వన దేవతల ప్రసాదాన్ని అందజేసి తెగ ప్రతినిధులను సన్మానించారు. మరోవైపు సమక్క-సారలమ్మ మహా జాతరకు సర్వం సిద్ధమైంది. నాలుగు రోజుల పాటు సాగే మహా ఘట్టాన్ని సమర్థంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సన్నద్ధమయ్యాయి. ఈ సారి సౌకర్యాల కల్పనతోపాటు నిర్మాణ పనులనూ ఏకకాలం చేపట్టారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఒకవైపు వన దేవతల గద్దెల పునర్నిర్మాణ పనులు సాగుతున్న సమయంలోనే లక్షలాది మంది ముందస్తుగా అమ్మలను దర్శించుకున్నారు. పార్కింగ్ సౌకర్యం, ట్రాఫిక్ నియంత్రణ, గద్దెల దర్శనం సందర్భంలో తోపులాట నివారణ, రద్దీ సందర్భాల్లో చోరీల కట్టడి అంశాలపై పోలీసు శాఖ భారీ కసరత్తు చేసింది. ట్రాఫిక్ తగ్గించేందుకు రూట్ మ్యాప్‌లను సిద్ధం చేసింది. 33 చోట్ల దాదాపు 1500 ఎకరాల్లో మూడు లక్షల వాహనాలు నిలిపేలా పార్కింగ్ స్థలాలను సిద్ధం చేశారు. ఏఐని వినియోగిస్తూ యాప్ ద్వారా ట్రాఫిక్ సమస్యలు, దర్శన సమయాల్లో రద్దీని నియంత్రించే చర్యలు చేపట్టనున్నారు. జాతరలో తప్పిపోయే అవకాశం ఉన్న పిల్లలు, వృద్ధులకు క్యూఆర్ కోడ్ ద్వారా జీపీఆర్ఎస్‌ను అనుసంధానం చేయడం వల్ల ఇక పిల్లలను ఇట్టే గుర్తించే సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. సీసీ కెమెరాలు ఫేస్ రికగ్నేషన్ సాఫ్ట్‌వేర్‌తో దొంగలను పట్టుకొనేందుకు సీసీఎస్, షీటీమ్‌లు సన్నద్ధమయ్యారు. జాతరకు ఆర్టీసీ విశాలమైన ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. 4 వేల బస్సులను ప్రయాణికులను తరలించేందుకు ఆర్టీసీ సిద్ధంగా ఉంచింది. ఈ నెల 31 వరకు మొత్తంగా 20 లక్షల మంది ప్రయాణిస్తారని అంచనా వేస్తోంది. మహిళలకు ఉచిత ప్రయాణ పథకం వర్తింపజేశారు. ప్రధాన జాతర తేదీల్లో భక్తుల రద్దీ కారణంగా గద్దెల ప్రాంగణం వద్ద అమ్మల దర్శనం ఆషామాషీ విషయం కాదు. ఈ సారి గద్దెల పునర్నిర్మాణం నేపథ్యంలో ప్రాకారం విస్తరించారు. రూ.100 కోట్లతో చేపట్టిన ఈ పనులు ఈ సారి జాతరకే వన్నె తీసుకొచ్చాయి. గద్దె విస్తరణ నేపథ్యంలో ఏకకాలంలో 9-10 వేల మంది దర్శించుకొనే వెసులుబాటు ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

# విశాఖలో కలవరం రేపుతున్న రోడ్డు ప్రమాదాలు

**80 బ్లాక్‌స్పాట్స్ గుర్తింపు**

**ప్రమాదకర మలుపులు, సరైన సూచిక బోర్డులు, తగిన కాంతి లేకపోవడం, గుంతలు, రోడ్ల ఆకృతుల్లో లోపాలు చోదకులకు శాపం**

**ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్, రవాణా, పోలీసు, ట్రాఫిక్, స్థానికసంస్థలు సంయుక్తంగా పని చేస్తేనే ఫలితం**



విశాఖపట్నం నగరంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు కలవరం రేపుతున్నాయి. కొన్ని మార్గాల్లో ఒకే ప్రదేశంలో పదే పదే చోటు చేసుకుంటున్న ఘటనలతో ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రమాదకర మలుపులు, సరైన సూచిక బోర్డులు, తగిన కాంతి లేకపోవడం, గుంతలు, రోడ్ల ఆకృతుల్లో లోపాలు చోదకులకు శాపాలుగా మారుతున్నాయి. ఇక్కడ శాఖలు సమన్వయంగా వ్యవహరిస్తేనే చోదకుల ప్రాణాలకు రక్షణ ఉంటుంది. బ్లాక్‌స్పాట్స్ అంటే: తరచూ ఒకేచోట ప్రమాదాలు జరిగే ప్రాంతాలను "బ్లాక్ స్పాట్స్"గా గుర్తిస్తారు. వీటి సంఖ్య తగ్గించడానికి ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్, రవాణా, పోలీసు, ట్రాఫిక్, స్థానిక సంస్థలు సంయుక్తంగా పని చేయాలి. జిల్లా స్థాయిలో రోడ్డు భద్రత కమిటీ వీటిపై సమీక్ష నిర్వహించి నిర్ణయాలు తీసుకుని అమలు చేయాల్సి ఉంది. జీవీఎంసీ పరిధిలో గతంలో 80కి పైగా బ్లాక్ స్పాట్స్ ఉన్నాయి. వాటి సంఖ్యను 67కు తగ్గించారు. గాజువాక, ఎండాడ, మద్దిలపాలెం, కొమ్మాది, మధురవాడ ప్రాంతాల్లో ఎన్‌హెచ్-16పై, తెలుగుతల్లి పైవంతెన, బాజీ, ఊర్వశీ కూడళ్లలో ఎక్కువ బ్లాక్ స్పాట్స్ ఉన్నాయి. ప్రతి చోటా ఏటా కనీసం 5-6 ప్రమాదాలు జరుగుతున్నాయి. పాఠశాలలు, కళాశాలల సమీపంలో 89 వేగ నిరోధకాలు ఏర్పాటు చేస్తున్నారు. 72 ఆసుపత్రుల వద్ద 100 వేగ నిరోధకాల ఏర్పాటుకు వర్క్ ఆర్డర్ మంజూరు చేశారు. 32 దేవస్థాన ప్రాంతాల్లో 66 థెర్మోప్లాస్టిక్, స్టడ్స్, రంబెల్ స్ట్రిప్స్ వంటి స్పీడ్ బ్రేకర్స్ పనులు సాగుతున్నాయి. 60 సూచిక బోర్డులు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్న చోట్లలో ఏర్పాటు చేశారు. ప్రమాదకరమైన హోర్డింగ్‌ల తొలగింపు జీవీఎంసీ, ఎన్‌హెచ్ సంయుక్తంగా చేపట్టారు. జ్ఞానాపురం, మర్రిపాలెం కూడళ్లను రీడిజైన్ చేశారు. మారికవలస కూడలిలో రైలింగ్ ఏర్పాటు చేశారు. కాకానినగర్, మారియెట్ కూడళ్లలో 15వ ఆర్థిక సంఘం నిధులతో పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇటీవల సీఐఐ సదస్సు సమయంలో వచ్చిన నిధులతో తాటిచెట్లపాలెం కూడలిలో పనులు చేపట్టారు. జూపార్కు వద్ద ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వెంకోజీపాలెం కూడలి పనులకు టెండర్లు ఖరారు చేయలేదు. ఆనందపురం కూడలి వద్ద బస్‌బే తుది దశలో ఉంది. కమిషనరేట్ పరిధిలోని 20 పోలీస్ స్టేషన్ల పరిధిలో 61లోపాలను పోలీసుశాఖ గుర్తించింది. రోడ్ల విస్తరణ, ఆక్రమణల తొలగింపు, వాహనాలు ఇష్టారాజ్యంగా వెళ్లకుండా అడ్డుకునేలా కొన్ని నిర్మాణాలు చేపట్టాలని భావిస్తున్నారు. కారుషెడ్డు కూడలి, కంచరపాలెంమెట్టు, బిర్లా, శీలానగర్, కూర్మన్నపాలెం, శ్రీహరిపురం కూడళ్లలో పనులు చేపట్టాలని నిర్ణయించినా అడుగులు పడటంలేదు. రాష్ట్రంలో గత మూడేళ్లలో ప్రమాదాలు జరిగిన సమయాలను విశ్లేషిస్తే సాయంత్రం దాటిన తర్వాత ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించారు. మూడేళ్లలో సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల మధ్య 11,867 ప్రమాదాలు జరిగాయి. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య 9,606 ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు 5,990 ప్రమాదాలు, 9 నుంచి 12 గంటల వరకు 7,740 ప్రమాదాలు, మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్య 8,318 ప్రమాదాలు జరిగాయి. అర్ధరాత్రి 12 నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు మాత్రం కొంత తక్కువగా 2,453 ప్రమాదాలు సంభవించాయి.

# బిర్యానీలో నిద్రమాత్రలు కలిపి భర్త హత్య - నిందితులు అరెస్టు

**భర్త హత్య కేసులో భార్య సహా ముగ్గురి అరెస్టు**

**పథకం ప్రకారం ఆస్తి రాయించుకుని, అడ్డు తొలగించుకోవాలని**

**ప్రియుడితో కలిసి బిర్యానీలో నిద్రమాత్రలు కలిపి భర్త హత్య**



వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే భర్తకు బిర్యానీలో మత్తు బిళ్లలు కలిపి హత్య చేసిన భార్య, ఆమె ప్రియుడు, వారికి సహకరించిన ఓ ఆర్ఎంపీ వైద్యుడిని దుగ్గిరాల పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం చిలువూరులో జరిగింది. నిందితులు గోపీ, లక్ష్మీ మాధురి, సురేశ్‌లను అరెస్టు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ వెల్లడించారు. 'గోపీకి, లక్ష్మీమాధురికి వివాహేతర సంబంధం ఉంది. లక్ష్మీమాధురి భర్త శివనాగరాజును చంపేందుకు వీరు గత నెల రోజుల నుంచి పథకం పన్నారు. ఈ క్రమంలోనే అదును చూసి ఆర్ఎంపీ సురేశ్ వద్ద గోపీ నిద్రమాత్రలు తీసుకుని లక్ష్మీమాధురికి ఇచ్చాడు. నిద్రమాత్రలను బిర్యానీలో కలిపి శివనాగరాజుకు పెట్టారు. బిర్యానీ తిన్న అనంతరం నిద్రమత్తులో ఉన్న అతడి గుండెపై అప్పడాల కర్రతో కొట్టి చంపారు. ఈ నెల 18న శివనాగరాజు అనుమానాస్పద మృతిపై కేసు నమోదైంది. అతడి మృతదేహంపై ఎలాంటి గాయాలూ లేవు. ఛాతీ ఎముకలు విరిగినట్లు శవపరీక్షలో తేలింది. దుగ్గిరాల మండలం చిలువూరుకు చెందిన లోకం శివనాగరాజు (48)కు లక్ష్మీ మాధురితో 2008లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. శివ నాగరాజుకు ఉల్లిపాయల వ్యాపారంలో, ఆన్‌లైన్‌లో షేర్స్‌లో నష్టాలు రావడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. అతని భార్య విజయవాడలోని ఓ సినిమా థియేటర్‌లో పనికి వెళ్లిన క్రమంలో అక్కడ సత్తెనపల్లి మండలం గార్లపాడు గ్రామానికి చెందిన కొండవీటి గోపితో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధంగా మారింది. భర్త తనను కొడుతూ హింసిస్తున్నాడని తరచూ గోపికి చెపుతుండేది. భర్త ఉల్లిపాయల వ్యాపారం చేయడం ఇష్టం లేని ఆమె భర్తను హైదరాబాద్‌లో కారు ట్రావెల్స్ నిర్వహిస్తున్న గోపీ వద్దకు ఉద్యోగానికి పంపించింది. ఈ క్రమంలో భార్య వివాహేతర సంబంధం గురించి శివనాగరాజుకు తెలియడంతో అతడు తిరిగి చిలువూరులోని తన ఇంటికి వచ్చేశాడు. ఈ విషయంలో భార్యను గట్టిగా మందలించాడు. బిర్యానీలో 30 మత్తు మాత్రలు: నెల రోజుల కిందటే పథకం ప్రకారం తన భర్త పేరుతో ఉన్న ఆస్తిని లక్ష్మీమాధురి తన పేరుతో రాయించుకుంది. ఆ తర్వాత అతడిని హతమార్చాలని ప్రియుడు గోపికి చెప్పింది. దీంతో పథకం ప్రకారం గోపి తన స్నేహితుడు ఫిరంగిపురం మండలం ఎర్రగుంట్లపాడుకు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు కంబంపాటి సురేష్‌తో కలిసి మత్తు బిళ్లలు తీసుకున్నాడు. ఈ నెల 18వ తేదీన 30 మత్తు బిళ్లలను చపాతీకర్రతో పొడిలా చేసి మటన్ బిర్యానీలో కలిపి లక్ష్మీమాధురి భర్తకు పెట్టింది. అత్తమామలకు అనుమానం రాకుండా వారికి సాధారణ బిర్యానీ పంపించింది. శివనాగరాజు మత్తులోకి వెళ్లగానే ముగ్గురూ కలిసి అతడి ముఖంపై దిండు వేసి అదిమి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేశారు. అనంతరం గోపి, సురేష్‌లు వెళ్లిపోయారు. ఆ తర్వాత లక్ష్మీమాధురి భర్త చరవాణి తీసుకుని వాచ్ హిస్టరీని పరిశీలించింది. కానీ పోర్న్ వీడియోలు చూడలేదని ఎస్పీ తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు డీఎస్పీ మురళీకృష్ణ పర్యవేక్షణలో సీఐ ఏవీ వీర బ్రహ్మం, ఎస్సై వెంకట రవి లోతుగా దర్యాప్తు చేపట్టారు. దీంతో లక్ష్మీమాధురి ఆమె ప్రియుడు గోపి, సురేష్‌లు ఈ హత్య చేసినట్లు తేలడంతో ముగ్గురినీ అరెస్టు చేసినట్లు ఎస్పీ చెప్పారు. కేసు ఛేదించిన పోలీసు అధికారులను అభినందించారు.

## ఎస్సారెస్పీ కెనాల్ లో గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభ్యం



**ఇబ్రహీంపట్నం జనవరి 27(ప్రజమంటలు దగ్గుల అశోక్ ) :** ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన జింక గంగాధర్ ం/శీ గంగారం,48 సం.లు, కులం: గుండ్ల, అను అతను సోమవారం రోజున రాత్రి అందాద 8:00 గంటల సమయంలో ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ కెనాల్ లో పడి కనపడకుండా పోయాడని, మృతుడి సోదరుడు అయిన జింక శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అతని ఆచూకీ కోసం మంగళవారం రోజున ఎస్సారె-స్పీ కెనాల్ వెంబడి గాలిస్తుండగా మధ్యాహ్నం అందాధ 2:00 గంటల సమయంలో ఇబ్రహీంపట్నం గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కెనాల్ నీటిలో మృతుడి శవం గుర్తించి మృతుడి సోదరుడు జింక శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించనైనదని ఎస్సై జి నవీన్ కుమార్ తెలిపారు.

## వల్బాపూర్ యువతకు రిలయన్స్ బయో ఎనర్జీ లిమిటెడ్ లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

**రిలయన్స్ బయో ఎనర్జీ అధికారికి వల్బాపూర్ గ్రామపంచాయతీ నుండి వినతి**



**ఎల్కతుర్తి జనవరి 27 ప్రజా మంటలు :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని వల్బాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలంటూ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రిలయన్స్ బయో ఎనర్జీ లిమిటెడ్ సంస్థకు సంబంధిత అధికారికి వినతిపత్రం అందజేశారు. సూరారం గ్రామ పరిధిలో నిర్మాణం పూర్తి చేసుకున్న రిలయన్స్ బయో ఎనర్జీ లిమిటెడ్ సంస్థలో వల్బాపూర్ గ్రామానికి చెందిన అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని గ్రామపంచాయతీ ప్రతినిధులు కోరారు. గ్రామ యువతకు ఉపాధి కల్పిస్తే నిరుద్యోగుల ఆర్థిక స్థితి మెరుగు పడడంతో పాటు గ్రామాభివృద్ధికి కూడా దోహదపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పొనగంటి శ్వేత శ్రీనివాస్ మాట్లాడుతూ, స్థానిక పరిశ్రమలు గ్రామ యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గ్రామ పరిధిలోని నిరుద్యోగ సమస్యకు పరిష్కారంగా సంస్థ యజమాన్యం సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పొనగంటి శ్వేత శ్రీనివాస్, ఉపసర్పంచ్ అంబాల అనిల్ కుమార్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించిన జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్



**జగిత్యాల జనవరి 27 (ప్రజా మంటలు) :** 1వ వార్డులో 17 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను,4వ వార్డులో రోడ్డు పనులను పరిశీలించిన జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్ .వెంట తాజా మాజీ కౌన్సిలర్ లు,వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శంకుల పల్లి లో డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేయడం తో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారం చేయటం జరిగింది. జగిత్యాల పట్టణంలో అన్ని వార్డులలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పట్టణంలో అన్ని కుల సంఘాల భవనాలకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. జగిత్యాల పట్టణ ధర్మపురి గొల్లపల్లి రోడ్డు బైపాస్ రోడ్డు పైప్ లైన్ సమస్య పరిష్కారానికి ఒక కోటితో టెండర్ ప్రక్రియ పూర్తయింది. జగిత్యాల తిప్పన పేట బ్లాక్ స్పాట్ రోడ్డుకు 16 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి త్వరలోనే పనులు ప్రారంభించుకుంటాం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట మల్లికార్జున్ కుసరి అనిల్ క్యాదసు నాగయ్య క్యాదసు నవీన్ శరత్ రావు ఏనుగుల రాజు చుక్క నవీన్ కూతురు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల ఒకటో వార్డు పలువురు బిజెపిలో చేరిక



**జగిత్యాల జనవరి 27 ( ప్రజా మంటలు) :** పట్టణ 1వ వార్డు చెందిన బండి వంశీ మరియు వార్డు సభ్యులు కేంద్ర ప్రభుత్వం మరియు నరేంద్ర మోడీ అమలు చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలకు ఆకర్షితులై భారతీయ జనతా పార్టీలో చేరగా జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు తో కలిసి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా. బోగ శ్రావణి ఈ కార్యక్రమంలో జగిత్యాల పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్,జిల్లా ప్రధాన కార్యదర్శి నలువాల తిరుపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నరేందర్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముదరాజు, దూరిశెట్టి మమత, మరియు తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ యూత్ కాంగ్రెస్ నాయకులు బి ఆర్ఎస్ పార్టీలో చేరిక



**జగిత్యాల జనవరి 27 (ప్రజా మంటలు) :** పట్టణ మైనారిటీ యూత్ కాంగ్రెస్ నాయకులు అసిం సవన్ మరియు యువకులు కరీం అలిమ్ అఖిల్ సదాబ్ ఇమ్రాన్ మైనార్టీ లకు కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి ఈరోజు జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఆసిఫ్ జూనిడ్ రిజ్వాన్ చాంద్ భాయ్ సర్జీల్ ముజాహిద్దీన్ ఆరిఫ్ ఫహద్ ఫయాజ్ బారి ఇర్షబ్ బబ్లూ కాలిమ్ తదితరులు ఉన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుంది

**డాక్టర్ కోట నీలిమ**



**సికింద్రాబాద్, జనవరి 27 (ప్రజా మంటలు) :** సమాజానికి కేవీఎస్ రామశర్మ చేసిన సేవలు వెలకట్టలేనివని పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమ అన్నారు. న్యూ బోయిగూడ సెయింట్ జాన్ మరియా వియాని చర్చి గ్రౌండ్‌లో నిర్వహించిన దివంగత సామాజిక సేవకులు కేవీఎస్ రామశర్మ మెమోరియల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...యువత చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని, ఐక్యత, స్నేహభావం పెరుగుతాయని తెలిపారు. గెలుపుఓటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని చాటాలని పేర్కొన్నారు. ఓటమి చెందిన వారు నిరుత్సాహపడకుండా భవిష్యత్ గెలుపు కోసం కృషి చేయాలని హితవు పలికారు. పట్టుదల, క్రమశిక్షణ ఉంటే ఏదైనా సాధించవచ్చుని, క్రీడల్లో ముందుకు సాగాలంటే నిరంతర సాధన అవసరమని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నారని, రాష్ట్రంలో క్రీడా విశ్వవిద్యాలయం ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఎల్లప్పుడూ క్రీడాకారులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాండు గౌడ్, నారాయణ, కృష్ణ ముదిరాజ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com